కథ

# సైంటిఫిక్ బాబా

## -అల్లాడి మల్లేశయ్య

**''అణుబాంబులతో సాధించలేనిది ప్రేమతో సాధించ వచ్చు. విమానాలతో, జెట్లతో, రాకెట్లతో చేరు కోలేనిది ప్రేమతో చేరుకోవచ్చు. డబ్బుతో కొనలేనిది ప్రేమతో కొనవచ్చు. ప్రేమ రుచి మధురమైనది, ప్రేమకు ఎలాంటి ఎల్లలూ లేవు, ప్రేమ అనేది రెండు జీవాల మధ్య ఏర్పడే ఒక గొప్ప అద్భుతం! అది తల్లీ కొడుకుల మధ్య కావొచ్చు, అన్నాచెల్లెల మధ్య కావొచ్చు, భార్యాభర్తల మధ్య కావొచ్చు, ఇద్దరు ప్రేమికుల మధ్య కావొచ్చు, మనిషికి మనిషికి మధ్య కావొచ్చు, ఇంకా చెప్పాలంటే మనిషికి పెంపుడు జంతువుకి మధ్య కావొచ్చు...''**

ప్రేమానంద స్వామి వుపన్యాసం సాగిపోతూంది. భక్తులు నిశ్శబ్దంగా, భక్తితో, ప్రేమ వుప్పొంగిన వద నాలతో స్వామివారి వుపన్యాసం వింటున్నారు. స్వామి వారికి నలభై ఏళ్లు వున్నా చూడటానికి 25 ఏళ్ల యువకుడిలా కన్పిస్తారు. కొందరేమో యోగా వల్ల స్వామి వారు అలా వున్నారని, ఇంకొందరేమో స్వామి వారి కళ్లలో వుట్టిపడుతున్న దైవత్వం వల్ల అలా కన్పిస్తున్నారని, ఇంకొందరేమో స్వామి వారి ప్రేమ తత్వం వల్ల వయసుని జయించారని అనుకుంటూ వుంటారు.

ప్రధానమంత్రి, రాష్ట్రపతి, గవర్నర్లు, ముఖ్య మంత్రులు, మంత్రులు ముందు సీట్లలో ఆసీనులయి వున్నారు. వారి వెనుకాల వరుసలో ముఖ్య అతిథులు, విదేశీయులు కూర్చున్నారు. బాబాగారి 40వ జన్మ దినోత్సవం సందర్భంగా జరుగుతున్న బ్రహ్మాండమైన వుత్సవమది. బాబాగారు ప్రేమ మఠాన్ని స్థాపించి పది సంవత్సరాలయ్యింది. ఈ పది సంవత్సరాలలో ఆయన పేరు దేశమంతా ప్రాకిపోయింది. స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు, నీటి వసతి, రోడ్ల నిర్మాణం, ఒకటేమిటి ఆయన చేయని మంచిపని లేదు. ముఖ్య మంత్రులు, గవర్నర్లు, మంత్రులు అయన కను సన్నలలో మెలుగుతుంటారు. బాబాగారంటే ఎనలేని భక్తి, భయం ఏర్పడి పోయాయి. బాబాగారి వుప న్యాసం సాగిపోతోంది. ఒక భక్తుడు దాన్ని ఆంగ్లంలోకి అనువదిస్తున్నాడు.

''ప్రేమలో దైవాన్ని చూడండి. ప్రేమతోఏదీ సరి తూగదు, ప్రేమ తప్ప. ప్రేమించే హృదయాన్ని ఏ శక్తీ నాశనం చేయలేదు. ప్రేమే దైవం. దైవమే ప్రేమ'' అంటూ బాబాగారు వుపన్యాసం ముగించారు. ప్రజ లంతా తోసుకుంటూ ముందుకు వస్తున్నారు బాబాగారిని దగ్గరనుంచి చూడటానికి. వాలంటీర్లు జనాలని అదుపులో వుంచడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. కొద్దిసేపయ్యాక బాబాగారు లోనికెళ్లి పోయారు.

అందరూ లేచి వెళ్తున్నారు. నాలుగో వరుసలో కూర్చున్న రాజు మాత్రం అలాగే ఆలోచిస్తూ వుండి పోయాడు. రాజు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో జెనిటిక్స్ ప్రొఫెసర్. చిన్న వయసు




లోనే ప్రొఫెసర్‌గా మంచి పేరు సంపాయించాడు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రధానమంత్రికి ముఖ్య సలహాదారు. రాజుకు చిన్నప్పటి రోజులు గుర్తుకు వచ్చాయి.

అందరూ లేచి వెళ్తున్నారు. నాలుగోవరుసలో కూర్చున్న రాజు మాత్రం అలాగే ఆలోచిస్తూ ఉండి పోయాడు. రాజు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటిలో జెనెటిక్స్ ప్రొఫెసర్, చిన్న వయసు లోనే ప్రొఫెసర్‌గా మంచి పేరు సంపాదించాడు. సైన్స్ అండ్ టెక్నాలజిలో ప్రధాన మంత్రికి ముఖ్య సలహాదారు. రాజుకు చిన్నప్పటి రోజులు గుర్తుకు వచ్చాయి.

స్కూల్లో రాజ్ కుమారు, ప్రేమ్‌కుమారు ఏదీ చేసినా కలిసే చేసేవారు. ఉపన్యాస పోటీల్లో, వ్యాసరచన పోటీల్లో ఎవరికి మొదటి బహుమతి ఇవ్వాలో తెలియక టీచర్లు తికమక పడేవారు. గణితంలో మాత్రం ఎప్పుడూ ప్రేమ్‌కుమారే ఫస్టొచ్చే వాడు. పదవతరగతిలో ప్రేమ్ కుమారుకి గణితంలో నూటికి నూరు మార్కులు వచ్చినా గాని, బయాలజీ మీది మక్కువతో బి.పి.సి. గ్రూప్‌లో జాయిన్ అయ్యాడు. తల్లితండ్రులు స్నేహితులు ఎంత చెప్పినా వినలేదు. తెల్లకోటు వేసుకొని, మెడలో స్టెతస్కోపుతో డింగు. డింగు మంటు తిరిగే డాక్టర్లకు, ప్రజలు చూపించే గౌరవం, ఆదరణ చూసి ఎప్పుడో వాడి మన సులో మెదిలేది, చదివితే ఇలాంటిదే చదువాలి అని. రాజ్‌కుమారూ అంతే ఎంచక్కా, ప్రేమ్‌కుమార్‌తో పాటు బి.పి.సి.లో జాయిన్ అయ్యాడు. అప్పటినుండి అందరూ వాళ్లని జంటకవులు అని పిలిచేవారు.

ఇంటరులో ప్రేమ్‌కుమారు ఆలోచనా పరిధి కొంచెం పెరిగింది. ఇంటరు అయిపోగానే అందరిలా మెడిసిన్‌లో చేరకుండా డిగ్రిలో చేరాలి అని నిర్ణయం తీసుకున్నాడు. డిగ్రీలో అప్లై చేయడానికి వెళ్తుంటే రాజ్‌కుమార్ అడిగాడు.

''ఏంటిరా నువ్వు, బి.పి.సి.లో చేరావు బాగానే వుంది. ఎంచక్కా

మెడిసన్ చేసి డాక్టరు కాకుండా డిగ్రీ అప్లై చేయడమేంటి? నీగ్గాని పిచ్చి పట్టిందా?'' అని.

ప్రేమ్‌కుమార్ చిన్నగా నవ్వి

''అందరిలా మనమూ మెడిసిన్ చేస్తె, మనకూ వాళ్లకు తేడా ఏంటిరా? మనమెప్పుడు ప్రజలంతా గౌరవించే, ఆరాధించే, ప్రజలంతా ఇష్టపడే పనులు చేయాలిరా. పిహెచ్.డి చేద్దాం. సైంటిస్టవుదాం. ప్రపంచ ఖ్యాతి నార్జిద్దాం'' అన్నాడు. వాడి ముఖ ములో కన్పించిన నమ్మకము చూస్తె వీడేదైనా సాధించ గలడు అన్నట్లుగా ఉంది. వాడి నమ్మకము, మాటలు చూసి, రాజుకు కూడా డిగ్రీ చదవడం సబబుగానే అన్పించింది. అంతే రాజు కూడా డిగ్రీలో చేరిపో యాడు. డిగ్రీ అయిపోయింది. ఇద్దరు పిజిలో జాయిన్ అయ్యారు. అక్కడే ప్రేమ్‌కుమార్ జీవితం

ఒక మలుపు తిరిగిపోయింది. వయసూ వచ్చింది. ఆలోచించే పరిధీ పెరిగిపోయింది. ఈ దేశంలో సైంటిస్టుకు పెద్దగా విలువ లేదు అన్న విషయం క్రమంగా అర్థం కాసాగింది. క్లాసులకు పోకుండా లైబ్రరీకి వెళ్లడం, ఏవో పుస్తకాలు చదవడం, ఏదో ఆలోచించడం చేసేవాడు. ఒకరోజు రాజు దగ్గరికి వచ్చి ''అరే రాజు, మనం పి.జి చేస్తాం, ఆపై డాక్టరేట్ తీసుకుంటాము. బాగానే ఉంది. దాని వలన ఉపయోగమేంటిరా?'' అని అడిగాడు. రాజుకు ఏదో కరెంట్ షాక్ తగిలినట్లుగా అయ్యింది.

''అదేంటిరా, నువ్వే కదా మెడిసిన్ వద్దు డిగ్రీ చేద్దాం. పిజి చేద్దాం, ఆపై సైంటిస్టవుదాం అంది, మరి ఇప్పుడేంటి ఇలా మాట్లాడుతున్నావు'' అన్నాడు.

''కరక్టేరా, నేనప్పుడు అలా అనుకున్నాను. కాని ఆలోచనా పరిధి పెరగుతున్న కొలది అది తప్పని బలంగా అనిపిస్తోంది. నేను స్కూళ్లో ఉన్నప్పుడు డాక్టర్ అంటే చాలా గొప్ప వృత్తి అనుకున్నాను. కాని ఇంటర్‌లో, అది కాదని డిగ్రీలో చేరాను. నేనెప్పుడు కోరుకునేది ఒకటే, మన సమాజం గొప్పగా చూసే వృత్తి చేయాలని. ప్రజలంతా నావైపు ఒక ఆరాధనా భావంతో చూడాలనేదే నా కోరిక. రేపు సైంటిస్టయితే ఏముంది? ఎవడో ఒక చచ్చు మంత్రి చెబితే ప్రయోగాలు ఆపాలి. లేదంటే ఎవడో ఒక చిన్న మత నాయకుడు అయ్యో, ఘోరం జరిగిపోతుంది. ఈ సైన్సు ప్రయో గాలు మానవాళికి ముప్పు తెస్తు న్నాయి అంటే మూలన కూర్చోవాలి...''

''మరి ఏం చేద్దామని?'' కొంచెం విసుగ్గా అడిగాడు రాజు. కొంచెం సేపు ఆలోచించి

''అది నాక్కూడా తెలియదు. కాకపోతే ఒక విషయం మాత్రం చెప్పగలను. మన సమాజం గొప్పగా చూసే పని!'' అన్నాడు ప్రేమ్‌కుమార్.

వాడిని చూస్తుంటే రాజుకు మనసులో భయం స్టార్టయ్యింది.

''అట్లాంటివన్ని ఆలోచించకురా. పరీక్షలు దగ్గరికొస్తున్నాయి. నువ్వు పూర్తి చేయాల్సిన రికార్డ్సు అవి చాలా ఉన్నాయి. ముందు వాటి పని చూడు'' అంటు మెస్‌వైపు దారి తీసాడు, ఇంకా ఆ విషయాన్ని పొడిగించడం ఇష్టం లేక.

పరీక్షలు ఇంకో రెండు నెలల్లో ఉన్నాయనగా ప్రేమ్‌కుమార్ కన్పించకుండా పోయాడు. ఎంతో వెదికారు. పోలీసు రిపోర్టు ఇచ్చారు. రేడియోల్లో, పత్రికల్లో ప్రకటించారు. ఉపయోగం లేకుండా పోయింది. ఆ తరువాత రాజు ప్రేమ్‌కుమార్‌ను చూడటం ఇదే మొదటిసారి. ప్రేమానంద స్వామి ప్రేమ్‌కుమారని. కాని అప్పటికే ప్రేమనందస్వామి చాలా ఎత్తుకు ఎదిగిపోయాడు. ఈరోజు రాజ్‌కుమార్‌కు నాలుగవ వరుసలో చోటు దొరకడానికే ఎంతో కష్టమయిపోయింది.

''సరే ఎలాగయిన ఈ రోజు బాబాని కలువాలి'' అని మనసులో అనుకున్నాడు. అంతలో కాషాయ వస్త్రాలు ధరించిన ఒక యువకుడు, బాబావారి భజన బృందం నుండనుకుంటా వచ్చి

''రాజు గారంటె మీరేనా?'' అని అడిగాడు.

''అవును'' రాజ్‌కుమార్ కొంచెం ఆశ్చర్యంగా చూసాడు.

''బాబా వారు మిమ్మల్ని




అనుగ్రహించారు. లోనికి పిలుస్తున్నారు'' అన్నాడు.

''అంటే నన్ను గుర్తు పట్టాడన్న మాట'' అని మనసులో అనుకొని. లేచి అతనితో బయలుదేరాడు.

★★★

దారి పొడుగునా పూర్తిగా మెత్తటి కార్పెట్ పరిచి ఉంది. దారికి ఇరువైపులా అలంకరణలు. భద్రతా చూస్తూ ఉంటే పూర్వం కవులు వర్ణించిన రాజ్ మహల్‌లా ఉంది. ఆ దారి ఒక పెద్ద హాలులోకి దారి తీసింది. ఆ హాలుకు అనుకుని చిన్న, చిన్న గదులు ఉన్నాయి. ఆ యువకుడు అక్కడ ఆగి '' ఆ గదిలో కూర్చొండి. బాబాగారు వస్తారు'' అని ఒక గది చూపించి వెళ్లిపోయాడు. రాజు తలుపు తీసుకుని అందులోకి వెళ్లాడు. చల్లని గాలి రివ్వున తగిలింది. బయట పాలరాతి గోడలు, లోపల ఏ.సి. చేయబడి ఉంది, లోపలంతా గమ్మత్తయిన పరిమళం వెదజల్ల బడ్తోంది. బయటికి లోపలికి ఎంత తేడా! ఏదో స్వర్గం లోకి వచ్చినట్లుగా ఉంది. లోపల నిశ్శబ్దంగా ఉంది. ఏ.సి. శబ్దం సన్నగా వినిపిస్తోంది. రాజు కుర్చోబోయేలోపు వేరే ద్వారం




గుండా బాబాగారు ప్రవేశించారు. పట్టు వస్త్రాలతో బాబాగారు దగ దగా మెరిసిపోతున్నారు. కాంతితో నిండిపోయిన కళ్లు, తృప్తి వలన మెరుస్తున్న వదనం, పెదాల మీద నాట్యమాడుతున్న చిరునవ్వుతో ప్రేమ్‌కుమార్ వస్తుంటే రాజు అలాగే చూస్తుండిపోయాడు.

''ఏరా రాజూ బాగున్నావా?'' అదే పిలుపు. అదే కంఠం. కాలేజీ రోజుల్లో ఎలా పిలిచేవాడో అచ్చు అలాగే. కొన్ని లక్షల మందిని మంత్రముగ్ధుల్ని చేసిన ఇందాకటి ఆ కంఠానికి, ఎప్పుడో కాలేజీ రోజుల్లోని ఈ కంఠానికి అసలు పోలికే లేదు.

అన్ని రోజుల తర్వాత మిత్రున్ని చూసిన ఆనందంతో, రాజుకు నోట మాట రాలేదు. అలాగే చూస్తుండిపోయాడు.

మళ్లీ ప్రేమ్‌కుమారే ''ఏంటిరా నేను ప్రేమ్ కుమార్‌ని. గుర్తు పట్టలేదా?'' అని అడిగాడు.

రాజ్‌కుమార్ గొంతు పెగల్చుకొని ''ఆ గుర్తుపట్టే వచ్చాను. మీ గురించి చాలా విన్నాను. ఇప్పుడు చూసాను. మీలాంటి మహానుభావుడు నాకు చిన్ననాటి మిత్రుడని గుర్తుకొస్తే మనసు ఆనందంతో పొంగిపోతుంది. ఇన్ని లక్షల మంది మీ పాద స్పర్శ కోసం పడిగాపులు గాస్తున్నారు. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి సైతం మీ దగ్గరికి వస్తున్నారంటే, ఇది మీ అద్భుత శక్తికి నిదర్శనం. నిజంగా దేవుడు మిమ్మల్ని అనుగ్రహించి, మీ ద్వారా గొప్ప పనులు చేయిస్తున్నాడు'' అన్నాడు. మాట్లాడుతున్నప్పుడు రాజ్‌కుమార్ గొంతు గద్గదమయిపోయింది. కళ్లలో కొంచెం కన్నీరు, ఒక గొప్ప అద్భుతాన్ని చూసిన అనుభూతి. ఆ అద్భుతం, తన చిన్ననాటి మిత్రుడన్న ఆనందంతో కలుగుతున్న పులకింత అది.

ప్రేమ్‌కుమార్ పెదాలు నవ్వుతో చిన్నగా విచ్చుకున్నాయి.

''నేను తీసుకున్న నిర్ణయం గొప్పదని, మానవుని ఆలోచనా పరిధి కంటె కొంచెం ఎత్తులో ఉందని, ఇప్పుడు పూర్తిగా నమ్ముతున్నాను రాజు'' అన్నాడు ప్రేమ్‌కుమార్.

''అంటే?'' రాజుకు కొంచెం అయోమయంగా అన్పించింది.

ఒకసారి ప్రేమ్‌కుమార్ కళ్లు మూసుకుని, కొంచెం భారంగా శ్వాస పీల్చి వదిలాడు, ఒక గొప్ప విషయం ఆరంభిస్తున్నదానికి సంకేతంగా.

''రాజు, ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు నా దగ్గరికి వచ్చినప్పుడు నేను పెద్ద గొప్పగా ఫీల్ కాలేదు. ఎందుకంటే వాళ్లు కూడా మొదట మనుష్యులే! తరువాతే ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి. ప్రతీ మనిషికి తెలియని దాని గురించి ఆసక్తి ఎక్కువ. ఆ ఆసక్తి కాస్త ఆలోచనగా మారి, అది కొన్ని సార్లు భక్తిగా, భయంగా ఇంకొన్ని సార్లు విరక్తిగా, కొన్నిసార్లు ఇంకే దోగా రూపాంతరం చెందుతూ ఉంటుంది. మనిషికి ఈ తెలియని విషయాల గూర్చి అభద్రతాభావం చాలా ఎక్కువ. మనిషి బ్రతికి ఉన్నప్పుడే కాకుండా చనిపోయాక కూడా క్షేమంగా, సుఖంగా ఉండాలని ఆశిస్తూ ఉంటాడు. ఈ ఆశ ప్రతిమనిషి బలహీనత. ఎవడైతే ఈ బలహీనతను అర్థం చేసుకుని, దాన్ని జయించగలుగుతున్నాడో, వాడు గొప్పవాడు. మిగతా వారికి ఆరాధ్యుడు. మరి నువ్వేమో దేశంలో కెల్లా గొప్ప జెనెటిక్ సైంటిస్టువి. అందులోనా చిన్నప్పటి నుండి నాతో పెరిగిన వాడివి. నా గురించి అన్నీ తెలిసిన వాడివి. అయినా కాని, ఈ ప్రజల్ని, మంత్రులను, అధికారులను చూసి నాకు దేవుడితో డైరెక్టుగా కమ్యూనికేట్ చేయడానికి, దేవుడి దగ్గరి నుండి మెస్సేజ్ రావడానికి ఓ డిష్ ఆంటెన్నా ఉంది అనుకుంటున్నావు. ఇక అలాంటప్పుడు నేను తీసుకున్న నిర్ణయం తప్పెలా అవుతుంది?'' రాజుకు నెమ్మదిగా ఏదో అర్థం కావడం మొదలయ్యింది.

అర్థమవుతున్న కొద్దీ, బాధ చేదుగా గొంతు దిగుతోంది.

''అంటే, అంటే... నువ్వు నిజంగా బాబావి కాదా? నువ్వు చేస్తున్న అద్భుతాలు దైవానుగ్రహం వల్ల కాదా? నీ భోదనలు అన్నీ ఉట్టివేనా? మరి ఇన్ని లక్షల మందిని ఎందుకు మోసం చేస్తున్నావు? ఒకప్పుడు అందరూ ఆరాధించే పని చేయాలన్నావు కదా, అంటే అందరిని మోసం చేయడమా? ఎందుకు, ఎందుకిలా చేస్తున్నావు? ప్రజలకు ఏదో ఒకరోజు ఖచ్చితంగా తెలుస్తుందిరా, అప్పుడు ఆరాధించడం కాదు కదా అసహ్యించుకుంటారు'' రాజు గొంతు కొంచెం కోపంగా పలికింది.

ప్రేమకుమార్ మళ్లీ చిన్నగా నవ్వాడు.

''చూడు, ఒక రెండు నిముషాలకు ముందు నన్ను గొప్ప వాడన్నావు. నాది పూర్వజన్మ సుకృత మన్నావు. దేవుడు అనుగ్రహించాడన్నావు. ఇప్పుడేమో మోసకారి అంటున్నావు.

ఇంకాసేపాగి మళ్లీ ఒక చిన్న అద్భుతం లాంటిది చూసి అవతార పురుషుడు అంటావు. సరే అంతెందుకు కనీసం నువ్వు నన్ను మోసగాడు అని అనగలిగావు. అదలా ఉంచు, నేనే ప్రజల మధ్యకెళ్లి అయ్యా, బాబు, నేనిన్ని రోజులు మిమ్మల్ని మోసం చేశాను, నేను బాబాను కాను, నేను చేసినవి అద్భుతాలు కావు అన్నానే అనుకో, కొందరేమో ''బాబాగారు మనల్ని పరీక్షిస్తున్నారు'' అనుకొంటారు. ఇంకొందరేమో ''అయ్యోయ్యో బాబా గారికి కోపమొచ్చింది'' అనుకొంటారు. మన ప్రార్థనలలో ఏదో లోపమున్నట్లుంది ఇక నుంచి ఇంకా శ్రద్ధగా ప్రార్థించాలి'' అనుకుంటారు. నా అనుగ్రహం కోసం హోమాలు చేస్తారు. భజనలు చేస్తారు, ఇంకా కావాలంటే ప్రాణత్యాగానికైనా సిద్ధపడతారు. ఎందుకంటే ఆ ఆధారపడే గుణం, ఎల్లవేళలా సుఖంగా ఉండాలి అనే ఆశ నరనరాల్లో పాతుకుపోయింది. ఒకవేళ నిజంగా ప్రజలకు తెలిసినా తెలియనట్లుగా నటిస్తారు. ఇంకా ''ఏమో మనకు తెలిసింది తప్పేమో'' అన్న భావన వలన.

రాజు, బాబా ఇద్దరు సీరియస్ గానే చర్చించుకుంటున్నారు. కూర్చోవడం కూడా మర్చిపోయి నిలబడే మాట్లాడుకుంటున్నారు. ఇంకా మాట్లాడవలసింది చాలా ఉందన్నట్లుగా ''రాజా, కూర్చో, చాలా రోజుల తర్వాత కలిసాం కదా, మాట్లాడాల్సింది చాలా ఉంటుందేమో'' అన్నాడు బాబా.

రాజు కూడా 'నిజమే మాట్లాడేది చాలా ఉంది' అన్నట్లుగా తలాడించి కూర్చున్నాడు. అకస్మాత్తుగా ఆ గదిని నిశ్శబ్దం ఆక్రమించుకుంది. ఇద్దరూ ఆలోచనలో పడిపోయారు.

రాజుకు మళ్లీ అన్పించింది ''ఎప్పుడూ వీడి మాటే వింటూ వచ్చాను. వీడి మార్గమే అనుసరిస్తూ వచ్చాను. కాని వీడి సంగతి అటో ఇటో తేల్చేయాలి'' అని.

''సరే నువ్వనేది బాగానే ఉంది. కానీ, ఊర్లో దొంగలు పడి దోచుకుంటున్నారని చెప్పి ఎవరైనా దొంగగా మారతారా ఏంటి? చేతనైతే దొంగని పట్టుకోవాలి కాని'' అన్నాడు రాజు.

''ఇక్కడ చేతనవడం, చేతనవక పోవడం అనేది సమస్య కాదు. ఇక్కడ సమస్య ఏంటంటే దొంగ రాగానే వాడికి కుర్చీ వేసి అతిథి మర్యాదలు చేయడం. సాష్టాంగ నమస్కారాలు చేసి, అయ్యా, దొంగగారు మీకు ఏమి కావాలో తీసుకెళ్ళండి అని ఆహ్వానించడం. సరే ఎవడైనా పట్టుకోవడానికి ప్రయత్నించాడే అనుకో వాడి గురించి ఏమంటారు 'ఆ అసలు వీడికి నమ్మకమే లేదు, దొంగంటే గౌరవం లేదు, భక్తీ లేదు, పాపభీతి అంతకన్నా లేదు, వీడికి దొంగ గూర్చి ఏమర్థమౌతుందేంటి?'' అని. మరి అంత సపోర్టు, విలువ ఉన్నప్పుడు ఎవడైనా దొంగని పట్టుకోవడానికి ప్రయత్నిస్తాడా, లేక దొంగగా మారడానికి ప్రయత్నిస్తాడా?'' అని ఎదురు ప్రశ్నించాడు బాబా. మళ్లీ తానే ''దొంగని చూసి గుర్తు పట్టాలంటే ముందు దొంగతనమంటే ఏంటో తెలియాలి కదా'' అన్నాడు.

''అరే ప్రేమ్‌కుమార్, ఏదో కెమిస్ట్రీలో ఈక్వేషన్‌లు, లెక్కలలో ఫార్ములాలు వ్రాసినంత ఈజీ కాదురా ఈ ఆధ్యాత్మిక విషయాలు''

''కరక్టే నేను కాదనడం లేదు. లెక్కలలో ఎక్కాలు రానివాడు, డార్విన్ గూర్చే తెలియని వాడు, అణువులు, పరమాణువుల గూర్చి ఓనమాలు తెలియని వాడు ఏదో నాలుగు మాటలు మాట్లాడి, ఇవన్నింటి గూర్చి తెలిసిన వాడికంటే గొప్పవాడై పోతున్నాడు. మరి అట్లాంటప్పుడు ఎవడైన అంత కష్టపడి లెక్కల్లో పిహెచ్.డి చేయడం, రాత్రింబవల్లు కష్టపడి జెట్‌లు, రాకెట్లు కనుక్కోవడం, జీవితాలను అంకితం చేసి జన్యు మార్పిడి పరిశోధనలు చేయడం అంతా మూర్ఖత్వమే కదా! వీటన్నింటి బదులు అర్థం కాకుండా నాలుగు మాటలు మాట్లాడితే సరి. అదే నేనూ చేస్తున్నాను. దాంతోపాటు మంచి పనులూ చేస్తున్నాను. నమ్మే వాళ్లకి అదీ. నమ్మని వాళ్లకు ఇది. ఇదొక పెద్ద సైన్సయి పోయింది.''

''దీనివల్ల నీకొస్తున్నదేంటి? నువ్వు సుఖపడ్తున్నదేంటి? ఇంతకూ నువ్వు సాధిస్తున్నదేంటిరా?'' రాజు కొంచెం కోపంగా అడిగాడు. బాబా ఒక క్షణం ఆలోచించి,

''ఈరోజు నేను చేయలేని పనేంటి చెప్పు?

నాకు లేందేంటి? ఒక గొప్ప సంతృప్తి పొందుతున్నాను. దైవాంశ సంభూతిడిగా పేరు ప్రఖ్యాతులు గాంచాను'' అన్నాడు. మళ్లీ తానే ''మిరాకిల్స్ చేస్తున్నాం, మాకు హీలింగ్ పవర్ ఉంది, కుంటివాళ్లు నడుస్తున్నారు, గుడ్డివాళ్లు చూస్తున్నారు అని టీవీల్లో ప్రకటనలు వస్తున్నాయే, వాళ్లని చూసావా? ఎవరైనా ఒక్కసారి వేసుకున్న సూటు మళ్లీ వేసుకుంటున్నారా? ఎవరైనా విమానంలో ఎకనామి క్లాసులో వెళ్తున్నారా?



ఇదంతా హైలెవర్ రా! ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్లు, జెనెటిక్స్‌లు అర్థమయినంత ఈజీగా ఇది అర్థం కాదు. ఇది అసలు పదార్థంతో సంబంధం లేని విషయం!! మనసుకు సంబంధించిన విషయం. దీనికి ఎక్కడా పుస్తకాలు లేవు. ప్రయోగాలు లేవు, ఎవరూ రీసెర్చ్ చెయ్యలేదు. ఎవడు బాగా ఉపయోగించుకో గలిగితే వాడే గొప్పవాడు.

రాజుకు ఏం మాట్లాడాలో తెలియక,

''లేదురా, నువ్వు నడుస్తున్న దారి మంచిది కాదు. నువ్వొకప్పుడు మంచి స్టూడెంటువి. గొప్ప సైంటిస్టువి కావలసిన వాడివి, ఇలా మోసం చేస్తు బ్రతకడం, బాబాగా మారడం ఎందుకో నాకు నచ్చలేదురా. నువ్విలా మారతావని ఎప్పుడూ అనుకోలేదు'' అన్నాడు.

''నేను ఎప్పుడూ అలా అనుకోలేదు మరి. నేను ప్రజలంతా గర్వించే గొప్ప పౌరున్ని కావాలని కలలు కన్నాను. కష్టపడ్డాను, చదివాను. అందరు క్రికెట్టు ఆడుతున్న సమయంలో నేను లెక్కలు చేసాను, అందరు వేసవి సెలవుల్లో, పిక్నిక్‌లు, టూర్లు అని ఎంజాయ్ చేస్తుంటే నేను మాత్రం బయాలజిలో ఎవల్యూషన్ థీరీలు చదివాను. గణితంలో నూటికి నూరొచ్చినా, బి.పి.సిలో చేరాను. జన్యుశాస్త్రవేత్త అవుదామనుకున్నాను. కాని ఏం లాభం, సమాజంలో బాబాకున్నంత విలువ దానికి లేదు మరి. నేనెప్పుడు బాబాగా మారాలని అనుకోలేదు మరి. ఈ సమాజమే నన్ను బాబాగా మార్చింది. ఎప్పటి వరకైతే సమాజంలో మార్పు రాదో, అప్పటి వరకు నాలాంటి బాబాలు, బ్రదర్సు, హీలర్స్ పుడ్తూనే ఉంటారు. మిరాకిల్స్ చేసే వాళ్లు చేస్తూనే ఉంటారు.

హీలర్స్ కుంటి వాళ్లని నడిపిస్తామని, గుడ్డి వాళ్లకు చూపు ఇప్పిస్తామని చెబుతూనే ఉంటారు. ఈరోజు టి.వి.లో రేడియో కొంచెం సేపు మాత్రమే ప్రచారం జరుగుతోంది. బిజినెస్ డెవలప్‌మెంట్ కోసం రేపు పూర్తిగా కొన్ని చానెల్స్ కేటాయించబడొచ్చు.

ఇదంతా ఎవరిమీద ఆధారపడి ఉంది? నమ్మేవాళ్ల మీద ఆధారపడి ఉంది. ఇక్కడ మోసం, దగా అనే పదాలకు చోటులేదు. ఇది కూడా ఒక వ్యాపారం. కొనాలా, వద్దా అని నిర్ణయించుకోవాల్సింది కొనేవాడు. అంతేకాని అమ్మేవాడు కాదు. నేనమ్మకపోతే ఇంకొకడు. అమ్ముతాడు'' అన్నాడు. మళ్లీ తానే చిన్న తల పంకించి ''వీటికేంలే కాని నాతో పాటు ఉండిపోరా. నా తర్వాత నా అంతవాన్ని చేస్తాను'' అన్నాడు.

రాజు చాలాసేపు ఆలోచించాడు. ఆలోచించి, ఆలోచించి ''ఒకప్పుడు నువ్వు బి.పి.సి.లో చేరితే నేనూ చేరాను. మెడిసిన్ వద్దంటే తలూపాను. కాని ఎందుకోనీతో ఏకీభవించి నీతో ఉండలేకపోతున్నాను రా, సారి'' అన్నాడు.

ఏదో అర్థమయినట్లుగా తల పంకించిన బాబా ''సరేరా నీ ఇష్టం అన్నాడు.''

ఇంతలోచిన్నగా తలుపు తట్టిన శబ్దమయ్యింది. బాబా అటు తిరిగి చెయిర్ ప్రక్కనే ఉన్న గ్రీన్ బటన్ ప్రెస్ చేశాడు. తలుపు తెరుచుకుంది. రాజును లోనికి తీసుకొచ్చిన యువకుడు తలుపు తెరుచుకొని లోనికి వచ్చి ''బాబాగారు క్షమించాలి. ఈరోజు సహపంక్తి భోజనాలు కదా, భోజనాలు సిద్ధం చేయమంటారా?'' అని అడిగాడు.

''ఆ చెయ్యండి'' అని రాజు వైపు తిరిగి పద, భోజనం చేద్దాం అన్నాడు.

★★★

అందరు బాబా గారికి నమస్కరించి భోజనానికి కూర్చున్నారు. రాజు కూడా అందరితో పాటు బాబాకు నమస్కరించాడు. భోజనశాలకు ప్రక్కనే భజన మందిరం ఉన్నట్లుంది, బాబాగారి భజన పాటలు జోరుగా వినిపిస్తున్నాయి. బాబాగారి భజన చేస్తున్న భక్తబృందం తన్మయత్వంతో పాడుతున్నట్టున్నారు. పాట మంచి రాగ యుక్తంగా ఉంది...

''రాముడి పాదం తాకెనులే
రాయే మనిషిగ మారెనులే
బాబా పాదం తాకిందో
ఓ అందా నీకు చూపొచ్చునులే:..''

వంటకాలు ఘుమ, ఘుమ లాడుతున్నాయి. రాజు తింటూ, తింటూ ఎందుకో తలపైకెత్తాడు. ఎదురుగా గోడమీద తాటికాయంత అక్షరాలతో వ్రాసి ఉంది.

''నన్నొకసారి మోసం చేస్తే అది నీ తప్పు
రెండవసారి కూడా చేయగలిగితే అది నా తప్పు
– బాబా'' అని. ●